Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-4 ;Oct,Nov& Dec;2026

తెలుగు దినపత్రికల సాహిత్యపుటలు – విలక్షణత

డా. కె. లావణ్య
తెలుగు అధ్యాపకురాలు, MJPTBCWRDC, వర్ధల్

Article Received: 05/10/2026; Article Accepted: 15/11/2026;
Published Online: 16/11/2026 DOI:10.37854/UIJMR.2026.3.4.52

సారాంశం

తెలుగు దినపత్రికలు సమాచార ప్రసార సాధనాలుగానే కాకుండా, తెలుగు భాషా సాహిత్య వికాసానికి దోహదపడే సాంస్కృతిక వేదికలుగా కూడా విశేషమైన పాత్రను పోషిస్తున్నాయి. ఆధునిక కాలంలో వార్తలు, రాజకీయాలు, ఆర్థిక, సామాజిక అంశాలకు ప్రాధాన్యత పెరుగుతున్నప్పటికీ, దినపత్రికలు ప్రత్యేక సాహిత్య పుటల ద్వారా సాహిత్యాభిరుచిని పెంపొందిస్తూ, నూతన రచయితలను ప్రోత్సహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, నమస్తే తెలంగాణ, నవ తెలంగాణ, మన తెలంగాణ, సాక్షి, ఆంధ్రజ్యోతి, వెలుగు వంటి తెలుగు దినపత్రికల సాహిత్య పుటలను ఈ వ్యాసం ప్రధానంగా పరిశీలిస్తుంది. ఆయా పత్రికలు ప్రచురించే సాహిత్య వ్యాసాలు, కవిత్వం, కథలు, గ్రంథ సమీక్షలు, భాషా సంబంధిత అంశాలు, సాహిత్య సమావేశాలు, పుస్తక పరిచయాల ద్వారా వ్యక్తమవుతున్న వైవిధ్యాన్ని విశ్లేషిస్తుంది. ముఖ్యంగా ప్రాంతీయ అస్తిత్వం, తెలంగాణ మాండలికం, అభ్యుదయ భావజాలం, విప్లవ సాహిత్యం, ప్రాచీన మరియు ఆధునిక సాహిత్య ధోరణులకు ఆయా పత్రికలు కల్పిస్తున్న ప్రాధాన్యతను వివరిస్తుంది. సాహిత్య పుటల శీర్షికలు, ప్రచురణాంశాలు, సంపాదకీయ లక్ష్యాలలో భిన్నత్వం ఉన్నప్పటికీ, తెలుగు భాషా సాహిత్య పరిరక్షణ, ప్రచారం, నూతన సాహిత్య సృజనకు ప్రోత్సాహం అందించడం వాటి ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. ఈ విధంగా తెలుగు దినపత్రికల సాహిత్య పుటలు సమకాలీన సాహిత్య వికాసానికి, పాఠకుల సాహిత్యాభిరుచి పెంపుదలకు, తెలుగు సాంస్కృతిక చైతన్యానికి దోహదపడుతున్నాయని ఈ పరిశీలన వెల్లడిస్తుంది.

కీలక పదాలు:తెలుగు దినపత్రికలు,సాహిత్య పుటలు,తెలుగు సాహిత్యం,ప్రాంతీయ అస్తిత్వం,సాహిత్య వికాసం

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-4 ;Oct,Nov& Dec;2026

పరిచయం :

సమాచార సేకరణలో మరియు సమాచార ప్రసారంలో పత్రికలు నేడు ఎంతో కీలకమైన పాత్రను పోషిస్తున్నాయి. దినపత్రికలలో జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ వార్తలు, ఆర్థిక, పారిశ్రామిక వార్తలు మొదలైనవి చోటుచేసుకుంటున్నాయి. పూర్తిగా సారస్వత విషయాలకు పరిమితమైన *సుజన రంజని* మొదలుకొని, నేటి వరకు పత్రికల్లో సాహిత్యానికి చోటు లభిస్తూనే ఉంది. అయితే పత్రికలు రాను రాను సారస్వత విషయాలకే పరిమితంకాక ఇతర విషయాలకు కూడా చోటిచ్చాయి. ఈ క్రమంలో ఇతర అంశాలకు ప్రాధాన్యత పెరిగి సాహిత్యానికి ప్రాధాన్యత తగ్గినట్లు కనిపిస్తుంది. ఆ లోటు పూరించేందుకు దినపత్రికలవారు వారంలో ఒకరోజు ఒక పేజీనిండా సాహిత్యాన్ని ప్రచురించేందుకు సాహితీ వేదికలను ప్రారంభించారు. ఫలితంగా సమకాలీన సాహిత్యానికి ప్రాధాన్యత పెరిగింది.

సాధారణంగా సాహిత్యపుటల్లో ఒక విమర్శావ్యాసం, ఒకటి నుంచి మూడు కవితలు, పుస్తక సమీక్షలు ప్రచురింపబడుతున్నాయి. నేడు వస్తున్న సాహిత్యపుటల్లో ప్రచురించే అంశాలు ప్రామాణికతను, సమగ్రతను సంతరించుకున్నాయి. దినపత్రికల్లో గ్రంథావిష్కరణలు, కవులు, సాహిత్యవేత్తల సన్మానాలు, నిర్యాణాలు మొదలైన వార్తలు మునుపటికన్నా ఇప్పుడు ఎక్కువే వస్తున్నాయి. ప్రస్తుతం తెలుగులో దాదాపు ఎనిమిదికిపైగా దినపత్రికలు ఒక ప్రత్యేక పేజీని సాహిత్యానికి కేటాయించి, అనేక రకాల సాహిత్యాంశాలను సాహిత్యపాఠకులకు అందజేస్తున్నాయి. వాటిలో ప్రధానంగా *ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, నమస్తే తెలంగాణ, నవ తెలంగాణ, మన తెలంగాణ, సాక్షి, వెలుగు* దినపత్రికలు మొదలైనవి.

ఈ పత్రికలు తమ సాహిత్యపేజీలను వివిధ రకాలైన శీర్షికలలో అందిస్తున్నాయి. వీటిపేర్లలో వైవిధ్యం ఉన్నట్లుగానే, అవి అందించే సాహిత్య విషయాలలో కూడా వైవిధ్యత స్పష్టంగా కనిపిస్తుంది. అయినప్పటికీ, అన్ని పత్రికల లక్ష్యం మాత్రం ఒక్కటే, సాహిత్యాన్ని పాఠకులకు అందించడం. ఒక్కొక్క పత్రిక కొన్ని లక్ష్యాలను ఏర్పరుచుకొని, ఆ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్నాయి. అందులో భాగంగానే పత్రికలు ఆయా విషయాలకు అధిక ప్రాధ్యానతను ఇస్తున్నాయి. అందువలనే పత్రికలలో విభిన్న రూపాలు కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో తెలుగు దినపత్రికలు నిర్వహిస్తున్న సాహిత్య వేదికల స్వరూపాన్ని, వాటి విలక్షణతను ఈ వ్యాసం పరిశీలిస్తుంది

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-4 ;Oct,Nov& Dec;2026

1. ఆంధ్రప్రభ దినపత్రిక సాహిత్యపుట - పరిశీలన

ఆంధ్రప్రభ దినపత్రిక 1938 ఆగస్టు 15వ తేదీన ప్రారంభమైంది. ఈ పత్రికను రామ్‌నాథ్ గోయెంకా(Ramnath Goenka) స్థాపించారు. ఇది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఆంగ్ల దినపత్రిక గ్రూపుకు చెందిన పత్రిక. ఈ పత్రికకు ఖాసా సుబ్బారావు, న్యాపతి నారాయణమూర్తి, నార్ల వెంకటేశ్వరరావు వంటివారు సంపాదకులుగా బాధ్యతలను నిర్వర్తించారు. ఈ పత్రిక 1959లో ఆగిపోయి, ఆరేడు నెలల తర్వాత వి.డి. ప్రసాదరావు సంపాదకత్వంలో తిరిగి ప్రారంభమై, ఇప్పటికీ కొనసాగుతుంది. ప్రస్తుతం ఈ పత్రికకు శ్రీ ముత్తా గౌతమ్ మరియు శ్రీ వై. ఎస్. ఆర్. శర్మ సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ పత్రిక జాతీయ భావవ్యాప్తికి, స్వదేశీ ఉద్యమానికి ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చింది. ఈ పత్రికలో ప్రాంతీయ వార్తల కంటే జాతీయ, అంతర్జాతీయ వార్తలే ఎక్కువగా ఉంటాయి.

ఆంధ్రప్రభ దినపత్రిక స్వాతంత్ర్యానికి పూర్వమే ప్రారంభమైన పత్రిక కాబట్టి భారత స్వాతంత్ర్యోద్యమంలోనూ, ఆంధ్రోద్యమంలోనూ పాల్గొని భారతజాతికి, తెలుగుజాతికి ఎనలేని సేవచేసింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపు నుండి *ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక* 1952 ఆగస్టు 15వ తేదీన ప్రారంభమైంది.

*ఆంధ్రప్రభ*లో ప్రతి సోమవారం 'సాహితీ గవాక్షం' శీర్షికన సాహితీ సంబంధమైన వ్యాసాలు, కవితలు, గ్రంథసమీక్షలు ప్రచురింపబడుతుంటాయి. పత్రికల ప్రారంభంలో ప్రాచీన సాహిత్య అంశాలు, అముద్రిత గ్రంథ ప్రచురణలు, ప్రబంధాలు, కావ్యాలు మొదలైన అంశాలు ఎక్కువగా చోటుచేసుకునేవి. తర్వాత రాను రాను సమకాలీన అంశాలకు ప్రాధాన్యతనిస్తూ వస్తున్నాయి. ప్రస్తుతం సమకాలీన సాహిత్య అంశాలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నాయి. ఈ పత్రికలో నవల , కథ, విమర్శకు సంబంధించిన వ్యాసాలు, భాషకు సంబంధించిన వ్యాసాలు ప్రచురింపబడుతున్నాయి. ఈ పత్రిక కవిత్వానికి సంబంధించిన అంశాలకు, దళిత సాహిత్యానికి సంబంధించిన అంశాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ వెలువడుతుంది.

గ్రంథ సమీక్షలు సాహిత్యంలో పేర్కొనదగినవి. మరుగున పడిపోయిన కావ్యాలను, గ్రంథాలను, సమకాలీన రచనలను గురించి పాఠకులకు అందజేయాలనే ఉద్దేశంలో పత్రికలు గ్రంథసమీక్షల్ని ప్రచురిస్తున్నాయి. *ఆంధ్రప్రభ* దినపత్రిక సమకాలీన గ్రంథ రచనలను ప్రోత్సహిస్తూ, గ్రంథ సమీక్షలను పాఠకులకు అందుబాటులో ఉంచుతుంది. ఈ *ఆంధ్రప్రభ*

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-4 ;Oct,Nov& Dec;2026

సాహిత్యపుటలో 'సాహిత్య వార్తలు' శీర్షికన పుస్తక ఆవిష్కరణలు, సభలు, సన్నివేశాలు, ఆహ్వానాలు, సదస్సులు వంటి సాహిత్యానికి సంబంధించిన అంశాలు ప్రచురింపబడుతున్నాయి.

ఉగాది, సంక్రాంతి, దీపావళి మొదలైన పర్వదినాల్లో ఒక ప్రత్యేక అనుబంధాన్ని విడుదల చేస్తుంది. ఇందులో కొన్ని సాహిత్య సంబంధ విషయాలుంటాయి. ముఖ్యంగా కవితలు, పండుగల యొక్క పురాణ సంబంధ విషయాలు, వాటి వైశిష్ట్యాన్ని, ప్రాముఖ్యాన్ని తెలిపే వ్యాసాలుంటాయి. *ఆంధ్రప్రభ* దినపత్రిక ప్రతి ఆదివారం ఒక అనుబంధాన్ని పుస్తకరూపంలో వెలువరిస్తుంది. ఇందులో కూడా సాహిత్య సంబంధమైన అంశాలకు ప్రాధాన్యత ఉంటుంది. తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేస్తున్న తెలుగు దినపత్రికలలో *ఆంధ్రప్రభ* దినపత్రిక ఒకటి.

2 ఆంధ్రభూమి దినపత్రిక సాహిత్యపుట

ఆంధ్రభూమి దినపత్రిక దక్కన్ క్రానికల్ (Deccan Chronicle) ఆంగ్ల దినపత్రిక గ్రూపునకు చెందింది. ఈ పత్రిక 1960లో ప్రారంభమైంది. దక్కన్ క్రానికల్ గ్రూపు నుంచి *ఆంధ్రభూమి* వార పత్రిక వెలువడింది. **ఆంధ్రభూమి దినపత్రిక ఆర్థిక ఇబ్బందుల వల్ల 2020 మార్చి నుండి తన ముద్రణను నిలిపివేసి, 2021 మార్చిలో అధికారికంగా పూర్తిగా మూతపడింది**. కాబట్టి ప్రస్తుతం ఈ పత్రిక అందుబాటులో లేదు.

ఆంధ్రభూమి దినపత్రికకు అత్యంత సుదీర్ఘకాలం ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన ప్రముఖ వ్యక్తి ఎం.వి.ఆర్. శాస్త్రి. ఆయన 1994 నుండి సుమారు రెండు దశాబ్దాలకు పైగా ఈ పత్రికకు సంపాదకత్వం వహించారు. ఆ తర్వాత 2018 లో **ముళ్ళపూడి సదాశివ శర్మ** ఈ పత్రికకు ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ దినపత్రిక గజ్జెల మల్లారెడ్డి సంపాదకత్వంలో వెలువడుతున్నప్పుడు ఎక్కువ పాఠకాదరణను సంపాదించింది. కేవలం రాజకీయ రంగానికే కాక, అన్ని రంగాలకు ప్రాధాన్యతనిస్తూ వెలువడుతున్న వార్తాపత్రిక ఇది.

ఆంధ్రభూమి దినపత్రిక ప్రతి సోమవారం *సాహితీ* శీర్షికన ఒక పూర్తి పేజిని సాహిత్య సంబంధ విషయాలను ప్రచురించింది. ఈ శీర్షికలో వ్యాసాలు, కవితలు, గ్రంథసమీక్షలు ప్రచురింపబడ్డాయి. ఈ పత్రిక ఒకప్పుడు ప్రతిరోజు నవలలను ధారావాహికంగా ప్రచురించేది. 'జీవన పోరాటం' (పొలిశెట్టి బ్రదర్స్), 'రాగమంజరి' (తాడేపల్లి భాగ్యలక్ష్మి - మాధవ్), 'వెచ్చని ఒడి' (రావినూతల సువర్ణా కన్నన్) వంటి సీరియల్స్ ఇందులో వచ్చినవే. అలాగే ఉగాది,

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-4 ;Oct,Nov& Dec;2026

దీపావళి, సంక్రాంతి లాంటి పండుగలను పురస్కరించుకొని ప్రత్యేక అనుబంధాన్ని వెలువరించేది. అనుబంధాల్లో కూడా సాహిత్య విషయాలు చోటుచేసుకునేవి.

ఇవేగాక, ప్రతి ఆదివారం దినపత్రికలోపాటు ఒక ప్రత్యేక అనుబంధం కూడా వెలువడేది. ఇందులో ఫజిల్ (సమస్యాపూరణం), సాహిత్య వ్యాసాలు, కథలు, కవితలు, గ్రంథ సమీక్షలు ప్రచురింపబడేవి. *ఆంధ్రభూమి* దినపత్రిక తెలుగు సాహిత్యానికి అమితమైన సేవలను అందించింది.

3 నమస్తే తెలంగాణ దినపత్రిక సాహిత్యపుట - పరిశీలన

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆవిర్భవించిన పత్రిక *నమస్తే తెలంగాణ. గోలకొండ పత్రిక* మూతబడిన తర్వాత తెలంగాణ ప్రాంతంవారు నిర్వహిస్తున్న పత్రిక ఇదొక్కటే. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల పక్షాన నిలబడిన పత్రిక ఇది. తెలంగాణ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (Telangana Publications Private Limited) ఆధ్వర్యంలో చిలప్పగారి లక్ష్మీరాజం నిర్వహణలో 2011 జూన్ 6వ తేదీన తెలంగాణ రాజకీయ నాయకులు, మేధావులు, ఉద్యమకారులు మొదలైనవారి సమక్షంలో అల్లం నారాయణ సంపాదకత్వంలో *నమస్తే తెలంగాణ* పత్రిక ప్రారంభమైంది. ఉపశీర్షికగా 'మన పత్రిక మన ఆత్మగౌరవం' అనే నినాదాన్ని ప్రకటించారు. ఈ పత్రిక తెలంగాణ ప్రాంతంలోని ఏడు జిల్లాల నుండి ప్రచురింపబడుతుంది. ఈ పత్రిక తెలంగాణ ప్రాంతపు సమస్యలపై ప్రధానంగా దృష్టిసారిస్తుంది. ప్రస్తుత సంపాదకులుగా తీగుళ్ల కృష్ణమూర్తి వ్యవహరిస్తున్నారు.

నమస్తే తెలంగాణ దినపత్రిక ప్రతి సోమవారం 'చెలిమె' శీర్షికతో సాహిత్య పుటను ప్రచురిస్తుంది. ఈ పత్రిక ప్రధాన ఉద్దేశ్యం 'తెలంగాణ ప్రాంత ఆత్మగౌరవం మరియు అస్తిత్వ పరిరక్షణ'. కాబట్టి ఈ పత్రిక ప్రాంతీయవాదానికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది. చరిత్రలో మరుగున పడిపోయిన కవులు, వారి రచనలు, ప్రఖ్యాతమైన కట్టడాలు, సంస్కృతికి సంబంధించినటువంటి వ్యాసాలను ఈ పత్రిక ప్రచురిస్తుంది. 'చెలిమె' సాహిత్య పుటలో ఎక్కువగా మరుగున పడిపోయిన కవులను గురించి రాసినవి కనిపిస్తాయి. తెలంగాణ ప్రత్యేకతకు, అస్తిత్వానికి చిహ్నంగా ఉండే సాహిత్యం అధికంగా ఉంటుంది. పత్రిక ప్రారంభంలో తెలంగాణ ప్రాంతభాషనే అసలైన తెలుగుభాష అని, పాల్కురికి సోమనాథ కవే లొలి తెలుగు కవి అనే విషయాల మీద సాహిత్య చర్చలు జరిగాయి.

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-4 ;Oct,Nov& Dec;2026

అదేవిధంగా కవుల/రచయితల జయంతి, వర్ధంతులకు సంబంధించిన వ్యాసాలు ఈ పత్రికలో ముద్రితమవుతున్నాయి. దళితవాదం, మైనారిటీ వాదం, బి.సి.వాదం ఇలా ఎన్ని వాదాలున్నా, తెలంగాణ రాష్ట్ర ప్రాతిపదికగా సాహిత్య వ్యాసాలు ఉన్నాయి. 'చెలిమె' సాహిత్యపుటలోని వ్యాసాలు, కవితలలో చాలావరకు తెలంగాణ మాండలికం చోటుచేసుకుంటుంది. ఈ సాహిత్య పుటలలో ప్రధాన వ్యాసం, కవిత్వంలో పాటు అనేక రకాలయిన సాహిత్యాంశాలను, కొత్త పుస్తకాలను పరిచయం చేసి, వాటిని గురించి చర్చిస్తుంది. సాహిత్యకారునికి సంబంధించిన, సాహిత్యానికి సంబంధించిన పూర్వాపరాలను విశ్లేషణ చేస్తుంది.

4 నవ తెలంగాణ దినపత్రిక సాహిత్యపుట - పరిశీలన

భారత కమ్యూనిస్టు పార్టీ (Communist Party of India) తరపున 1942 జూన్ 17వ తేదీన *ప్రజాశక్తి* వారపత్రిక ప్రారంభమైంది. వార పత్రికగా ప్రారంభమైన ఈ పత్రిక 1945 డిసెంబర్ 3వ తేదీన దినపత్రికగా మారింది. ఈ పత్రికకు ప్రముఖ సాహితీవేత్త ఉప్పల లక్ష్మణరావు ప్రారంభోత్సవం చేశారు. కమ్యూనిస్టులపై నిర్బంధకాండ కారణంగా 1948 ఏప్రిల్ 22వ తేదీన *ప్రజాశక్తి* ప్రచురణ ఆగిపోయింది. 1948 నుంచి 1950 వరకు కమ్యూనిస్టు పార్టీపై నిర్బంధాలు కొనసాగాయి.

1951లో నిర్బంధాల సడలింపుతో, 1951 నవంబర్ 21వ తేదీన *ప్రజాశక్తి* తిరిగి వారపత్రికగా ప్రారంభమైంది. 1952లో సార్వత్రిక ఎన్నికల కారణంగా ద్వైవార పత్రికగా వెలువరించారు. ఎన్నికల తర్వాత పత్రిక ప్రచురణ నిలిచిపోయింది. ఆ తర్వాత 1968 జూలై 27వ తేదీన తిరిగి వారపత్రికగా ప్రారంభమయింది. ఈ విధంగా పత్రిక పదమూడేండ్లు వారపత్రికగా, దినపత్రికగా, ద్వైవార పత్రికగా మారుతూ 1981 ఆగస్టు 3వ తేదీన దినపత్రికగామారి ఇప్పటికీ కొనసాగుతుంది. 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత *ప్రజాశక్తి* దినపత్రిక తన తెలంగాణ ఎడిషన్‌ను *నవతెలంగాణ* పేరుతో ప్రారంభించింది. ఈ ఎడిషన్‌ను 2015 మార్చి 21న ప్రారంభించారు. ఈ పత్రికకు ప్రస్తుతం ఆర్. సుధా భాస్కర్ సంపాదక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

నవ తెలంగాణ దినపత్రిక ప్రతి సోమవారం 'దర్వాజ' పేరుతో సాహిత్యపుటను ప్రచురిస్తుంది. ఇందులో ప్రాచీన, ఆధునిక, సమకాలీన సంబంధమైన సాహిత్య వ్యాసాలు, గ్రంథ సమీక్షలు చోటుచేసుకుంటున్నాయి. అభ్యుదయ ఉద్యమ సాహిత్యాన్ని ప్రచారం చేసిన

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-4 ;Oct,Nov& Dec;2026

పత్రికల్లో ఇదొకటి. తెలుగు దేశంలో కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల ప్రచారంతోపాటు సాహిత్య, భాషా రంగాలకు సంబంధించిన ఉద్యమాలను ప్రోత్సహించింది. సువిశాలమైన తెలుగు ప్రాంతంలోని మాండలిక పదాలనుపయోగించి, ఒక చక్కని వ్యవహారిక భాషా శైలిని రూపొందించడంలో ఈ పత్రిక కృషి మరువలేనిది.

ప్రపంచంలో ఏ చోట విధ్వంసం జరిగినా, దానికి సంబంధించిన వ్యాసాలు ఈ సాహిత్యపుటలో ప్రచురింపబడతాయి. విప్లవ కవుల గురించి లేదా విప్లవ నాయకుల గురించి వ్యాసాలను అందిస్తుంది. ప్రధానంగా విప్లవానికి సంబంధించిన విషయాలను పరిచయం చేస్తూ, వాటి గురించిన చర్చను చేస్తుంది. సభలు, సమావేశాలు, పుస్తక ఆవిష్కరణలు ఇలా అనేక అంశాలను ముద్రిస్తుంది.

5 మన తెలంగాణ దినపత్రిక సాహిత్యపుట - పరిశీలన

1952 జూన్ 22వ తేదీన భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రశాఖచే *విశాలాంధ్ర* దినపత్రిక ప్రారంభించబడింది. ఈ పత్రిక 1964లో భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ) అధికార పత్రిక అయ్యింది. పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, మద్దుకూరి చంద్రశేఖర రావుల సంపాదకత్వంలో ఈ పత్రిక స్థాపించబడింది. ఈ పత్రిక కమ్యూనిస్టు ఉద్యమాలకు అద్దం పడుతూ, ప్రగతిశీల సాహిత్యానికి చోటు కల్పిస్తుంది. 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత *విశాలాంధ్ర* దినపత్రిక తన తెలంగాణ ఎడిషన్‌ను *మన తెలంగాణ* పేరులో వెలువరిస్తుంది. ఈ ఎడిషన్‌ను 2015 జనవరి 25న ప్రారంభించారు. ప్రస్తుత సంపాదకులుగా అంజయ్య పోలిశెట్టి వ్యవహరిస్తున్నారు. *మన తెలంగాణ* దినపత్రిక 'కలం' పేరుతో తన సాహిత్య సంపదను పాఠకులకు అందిస్తుంది.

'కలం' సాహిత్యపుట ప్రముఖుల రచనల పరిచయం, పుస్తకాల పరిచయం, సదస్సుల సారం, బహుమతుల ప్రకటనలు, సాహిత్య కార్యక్రమాలు, విప్లవ పోరాటాలు మొదలైన అంశాలన్నీ కూలంకషంగా చర్చిస్తుంది. విప్లవ వీరుల జీవితాలను వినూత్న రీతిలో కొత్తగా, ఆధునిక అంశాలను జోడిస్తూ ఆనాటి కాలానికి ఈనాటి కాలానికి మధ్యగల వ్యత్యాసాన్ని వివరించి, సాహిత్యంపై నూతనమైన అభిలాషను కలిగించే ప్రయత్నం చేస్తుంది.

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-4 ;Oct,Nov& Dec;2026

ఈ పత్రిక కేవలం తెలంగాణ భావజాలంతో ఇక్కడి సాహిత్యం, అందులోని విప్లవాన్ని వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేసే ప్రయత్నం చేస్తుంది. సాహిత్యంలో ప్రముఖ స్థానాన్ని పొందిన కవుల కవిత్వాలను, పుస్తకాలను ప్రముఖంగా పరిచయం చేస్తుంది. ఆధునిక అంశాలతో విషయాలకు వ్యంగ్యాన్ని జోడిస్తూ తెలంగాణ యాసలో వ్యాసాలను అందిస్తుంది. ఈ సాహిత్యపేజీలో సాహిత్య వ్యాసాలు, గ్రంథ సమీక్షలు వెలువడుతుంటాయి. అలాగే ఈ పత్రిక ప్రతి ఆదివారం ఒక ప్రత్యేక అనుబంధాన్ని వెలువరిస్తుంది. ఇందులో సాహిత్యాంశాలు కూడా ప్రచురితమవుతున్నాయి. అభ్యుదయ సాహిత్యానికి సంబంధించిన ప్రముఖుల రచనలు ఇందులో వెలువడుతుంటాయి.

6 సాక్షి దినపత్రిక సాహిత్యపుట - పరిశీలన

వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో జగతి పబ్లికేషన్స్ (Jagati Publications) సాక్షి దినపత్రికను మార్చి 24, 2007వ సంవత్సరంలో ప్రారంభించింది. ఈ వార్తాపత్రిక పత్రికా రంగంలో పెద్ద సంచలనం. పత్రికలోని అన్ని పుటలు రంగులలోనే రావడం ఈ దినపత్రిక ప్రత్యేకత. ఈ పత్రిక హైదరాబాద్ నుంచి వెలువడుతుంది. ఈ పత్రిక మొదట్లో అన్ని పత్రికలకంటే అత్యధిక పుటలతో, అన్ని పత్రికల ధర కంటే తక్కువ ధరతో వెలువడింది. ప్రస్తుతం అన్ని పత్రికల ధరలాగే ఈ పత్రిక కూడా వస్తుంది. ప్రారంభమైన అనతికాలంలోనే విశేష పాఠకాదరణ పొందింది, ప్రస్తుతం సర్క్యులేషన్‌లో ప్రథమ స్థానంలో ఉంది. ఈ పత్రిక సంపాదకులుగా ప్రముఖ రచయిత కె.ఎన్.వై. పతంజలి పనిచేశారు. వీరి మరణానంతరం సీనియర్ పాత్రికేయులు వి. మురళి, కె. రామచంద్రమూర్తి సంపాదకులుగా వ్యవహరించారు. ప్రస్తుతం ఈ పత్రిక సంపాదకులుగా ఆర్. ధనంజయ రెడ్డి కొనసాగుతున్నారు.

ఈ పత్రిక ప్రతి సోమవారం 'సాహిత్యం' పేరుతో సాహిత్యాంశాలను పాఠకులకు అందిస్తుంది. 'సాహిత్యం' పుటలో కవి, కవి రచన, ఇతరత్రా సాహిత్యాంశాలకు సంబంధించిన సమగ్రమైన ప్రధాన వ్యాసాన్ని అందిస్తుంది. 'పెద్దల హాస్యం' పేరులో గొప్పవారు చేసిన లేదా ఎదుర్కున్న హాస్య సన్నివేశ అంశాలను ముద్రిస్తుంది. 'స్మరణ' ద్వారా కవులను స్మరించుకుని, ఆ కవి విషయాలని పాఠకుల ముందుంచుతుంది. జరిగిన సమావేశ విషయాలను 'ప్రసంగం' శీర్షికన ముద్రిస్తుంది. 'భాష ప్రయోగం' శీర్షికలో భాషకు సంబంధించిన అంశాలను గురించి

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-4 ;Oct,Nov& Dec;2026

వివరిస్తుంది. 'పుస్తక పరిచయం' ద్వారా అనేక రకాలైన పుస్తకాలను పాఠకులకు పరిచయం చేస్తుంది. 'ఈవెంట్' శీర్షిక ద్వారా వివిధ సాహిత్య పోటీలు, ప్రదర్శనలు, బహుమతులు, కార్యశాలలు, సాహిత్య సమాలోచనలు, రచయితల సంఘాల వేడుకలు, సాహిత్యకారుల పరిచయాలు మొదలైన అనేక విషయాలను తెలియజేస్తుంది. 'కవిత్వం' శీర్షికన కవుల సాహిత్యాన్ని మనకు పరిచయం చేస్తుంది. ప్రముఖుల సాహిత్యాన్ని, కవిత్వాంశాలను అధికంగా ముద్రిస్తుంది.

7 ఆంధ్రజ్యోతి దినపత్రిక సాహిత్యపుట - పరిశీలన

ఆంధ్రజ్యోతి దినపత్రికను 1960లో కె.ఎల్.ఎన్. ప్రసాద్‌విజయవాడ కేంద్రంగా స్థాపించారు. ఈ పత్రిక సంపాదకునిగా నార్ల వెంకటేశ్వరరావు తెలుగు పత్రికారంగంలో పేరు ప్రఖ్యాతులు గడించారు. కొడవటిగంటి కుటుంబరావు వంటి ప్రముఖుల రచనలు ఈ పత్రికలో ప్రచురితమయ్యేవి. 31 డిసెంబర్ 2000 సంవత్సరంలో ఈ పత్రిక ప్రచురణ నిలిచిపోయింది. అనంతరం ఇదే పత్రికలో పనిచేసిన వేమూరి రాధాకృష్ణ ఆధ్వర్యంలో 2002 అక్టోబరు 14 విజయదశమి రోజున ఈ పత్రిక పునఃప్రారంభమైంది. ఈ పత్రిక ప్రస్తుతం 20 కేంద్రాల నుంచి వెలువడుతుంది. ప్రస్తుతం ఈ పత్రికకు ఎన్. రాహుల్ కుమార్ సంపాదకులుగా ఉన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రిక సాహిత్యపుటను ప్రతి సోమవారం 'వివిధ' సాహిత్య వేదిక శీర్షికలో వెలువరుస్తుంది. ఈ పత్రిక యువతరాన్ని ప్రోత్సహించే, విలువైన విషయం కలిగిన కవితలను ఎంపిక చేసుకొని ప్రచురిస్తుంది. విషయాన్ని సూటిగా వివరిస్తూ, అంశాన్ని జఠిలంగా చూపకుండా పాఠకుడి పరిమితికి అనుగుణంగా కవిత్వాన్ని అందిస్తుంది.

ఈ పత్రిక ప్రధానంగా కవి/రచయితకు సంబంధించిన సాహిత్య విషయాలను అందిస్తుంది. వీటిలోపాటు కథలు, నాటకాలు, నవలలు మొదలైన అంశాలకు సంబంధించిన వ్యాసాలను అందిస్తుంది. ఈ మధ్యకాలంలో అనేక రకాలయిన పుస్తకాలు వెలువడుతున్నాయి. వీటి ప్రకటనలు, సమీక్షలు దాదాపు అన్ని తెలుగు దినపత్రికలలోనూ వస్తున్నాయి. కాని, విశిష్టమైన అంశం గల పుస్తకాలపై సమీక్షలు కేవలం *ఆంధ్రజ్యోతి* 'వివిధ' సాహిత్యపుటలోనే ఎక్కువుగా వస్తున్నాయి. ఈ సాహిత్యపుట ఈ ఒక్క అంశానికి పరిమితం అయినది కాదు. కవిత్వం, వ్యాసం, కథ, నవల, కథానిక, సాహిత్య సమావేశాలు, పుస్తక ఆవిష్కరణలు, నూతన

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-4 ;Oct,Nov& Dec;2026

పుస్తక సమీక్షలు, సాహిత్య ప్రకటనలు, ఇతర భాషలలోని రచనలను పరిచయం చేయడం, అంతేకాక సాహిత్య సంబంధ చర్చలు కూడా ఉన్నతంగా జరుగుతాయి. అలాగే ఆధునిక, ప్రాచీన సాహిత్యంలోని అనేక ప్రక్రియలలో విభిన్నమైన చర్చలను మనం గమనించవచ్చు.

సాహిత్యాన్ని అన్ని పత్రికలు అందిస్తున్నప్పటికీ, వ్యాసాలలో కొత్తదనం, విషయాన్ని సమగ్రంగా అందించటంలో 'వివిధ' సాహిత్యపుట నూతనత్వాన్ని అందిపుచ్చుకుంది. ఒకే ప్రాంతానికి సంబంధించిన సాహిత్యాంశాలను కాకుండా, అన్ని ప్రాంతాల సాహిత్యాలను అందించటంలో సమానత్వాన్ని పాటిస్తుంది.

8. ప్రభాత వెలుగు దినపత్రిక సాహిత్య పుట - పరిచయం

వెలుగు దినపత్రిక 2018 అక్టోబర్ 5న ప్రారంభమైంది. ఈ సంస్థ యాజమాన్యం వి.ఐ.ఎల్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్. వ్యవస్థాపకుడు మరియు సంపాదకులుగా అంకం రవి వ్యవహరిస్తున్నారు. సాహిత్య పేజీని ప్రభాత వెలుగు లైఫ్ &లిటరేచర్ పేరుతో ఈ పత్రిక ప్రచురిస్తుంది. ఇందులో కథలు, కవితలు, విశ్లేషణలతో పాటు తెలంగాణ సంస్కృతి, జీవన విధానం, విలక్షణ సాహిత్య అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

'వెలుగు' దిన పత్రిక కేవలం రాజకీయ, వార్తా విషయాలకే పరిమితం కాకుండా, తెలుగు సాహిత్య పరిమళాలను పాఠకులకు చేరువ చేయడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుంది. సాధారణ పత్రికల మాదిరిగా ఒక నిర్దిష్టమైన వారపు రోజున మాత్రమే కాకుండా, పత్రికలోని వివిధ ప్రత్యేక శీర్షికల ద్వారా, ఆదివారం అనుబంధాలలో మరియు ప్రత్యేక సందర్భాలలో సాహిత్యానికి పెద్దపీట వేస్తోంది. తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వాన్ని, మాండలిక వైవిధ్యాన్ని, జానపద సంస్కృతిని అలాగే సమకాలీన కవిత్వాన్ని వెలుగు పత్రిక తన పేజీల ద్వారా ప్రతిబింబిస్తూ వస్తోంది.వెలుగు పత్రికలో ప్రచురితమయ్యే కవితలు ప్రధానంగా సామాజిక స్పృహ, నేటి జీవనశైలి, మానవ సంబంధాల సంక్షోభం, పల్లె జీవనం మరియు ప్రకృతి సౌందర్యాన్ని ప్రతిబింబిస్తుంటాయి.యువ కవులతో పాటు లబ్ధప్రతిష్ఠులైన కవుల కవితలను ప్రోత్సహిస్తూ అర్థవంతమైన భావాలతో కూడిన పంక్తులను పాఠకుల ముందుకు తీసుకువస్తుంది.తెలుగు సాహిత్య చరిత్రకు సంబంధించిన విశేషాలు, ప్రాచీన, ఆధునిక కవుల పరిచయాలు, వారి ప్రస్థానాలపై సమగ్ర వ్యాసాలు వెలుగులో వస్తుంటాయి.

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-4 ;Oct,Nov& Dec;2026

మరుగున పడిపోతున్న జానపద కళలు, స్థానిక చారిత్రక కట్టడాలు, సంస్కృతి-సంప్రదాయాల వెనుక ఉన్న సాహిత్య మూలాలను విశ్లేషించే వ్యాసాలు దీని ప్రత్యేకత. తెలుగు సాహిత్యంలో వెలువడుతున్న నూతన నవలలు, కథా సంపుటాలు, కవితా సంకలనాలపై విశ్లేషణాత్మకమైన పుస్తక సమీక్షలను ప్రచురిస్తుంది. దీనివల్ల మంచి పుస్తకాలు పాఠకులకు చేరువ కావడంలో పాటు రచయితలకు ప్రోత్సాహం లభిస్తుంది.తెలంగాణ యాస, భాష, బతుకమ్మ, బోనాలు వంటి పండుగలు, జానపద గేయాలు, వృత్తి జీవితాల చిత్రణకు సంబంధించిన సాహిత్య రూపాలకు వెలుగు పత్రిక తన పేజీలలో సముచిత స్థానం కల్పిస్తుంది. వెలుగు దినపత్రిక అందించే సాహిత్య స్పర్శ కేవలం అక్షరాల కూర్పు మాత్రమే కాకుండా, సమాజాన్ని చైతన్యపరిచే ఒక సాంస్కృతిక వేదికగా నిలుస్తోంది.

ముగింపు

ఈ వ్యాసంలో ముద్రణ పొంది ప్రచురితం అవుతున్న పత్రికల సమాచారాన్ని మాత్రమే ఎంచుకున్నాను.వ్యాసం పరిమితి దృష్ట్యా అంతర్జాల పతికలను ఎంపిక చేసుకోలేదు. సమాచార విస్ఫోటనం సాగుతున్న నేటి ఆధునిక కాలంలో కూడా తెలుగు దినపత్రికలు సాహిత్యానికి ప్రత్యేక పుటలను కేటాయించడం అభినందనీయం. ఆంధ్రప్రభ, సాక్షి, ఆంధ్రజ్యోతిలతో పాటు నమస్తే తెలంగాణ, నవ తెలంగాణ, మన తెలంగాణ వంటి పత్రికలు 'సాహితీ గవాక్షం', 'చెలిమె', 'దర్వాజ', 'కలం', 'వివిధ' సాహిత్యం మొదలైన శీర్షికల ద్వారా పాఠకులకు వైవిధ్యభరితమైన సాహిత్యాన్ని అందిస్తున్నాయి.

ప్రాచీన, అభ్యుదయ, తెలంగాణ అస్తిత్వ, విప్లవ, స్త్రీవాద కవిత్వాలతో పాటు నూతన పుస్తక సమీక్షలు, సాహితీ సమావేశాల వార్తలను ప్రచురిస్తూ ఈ పుటలు సమకాలీన సాహిత్యానికి అద్దం పడుతున్నాయి. వైవిధ్యమైన భావజాలాలు, ప్రాంతీయ మాండలికాలు ఉన్నప్పటికీ, తెలుగు భాషా సాహిత్యాలను సుసంపన్నం చేయడమే లక్ష్యంగా ఈ దినపత్రికలు సాగిస్తున్న కృషి ప్రశంసనీయమైనది. వర్తమాన సాహిత్య వికాసానికి, నూతన కవుల ప్రోత్సాహానికి ఈ సాహిత్య పుటలు జీవనాడులుగా నిలుస్తున్నాయనడంలో సందేహం లేదు.

ఉపయుక్త గ్రంథ సూచి :

Publications
United International Journal of Multidisciplinary Research (UIJMR)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
ISSN: 3048-6726 www.uijmr.in Impact Factor: 6.934 (SJIF) Vol-3,Issue-4 ;Oct,Nov& Dec;2026

1. గోపాలరెడ్డి, బండి. 1973. బ్రౌన్ జాబులు - తెలుగు జర్నలిజం చరిత్ర(1832 - 1857). నెల్లూరు: నెల్లూరు హిస్టారిక్స్ పబ్లికేషన్స్.

2. చెన్నయ్య, జె. 2003 (మొదటి ముద్రణ 1998). తెలుగు దినపత్రికలు - భాషా, సాహిత్య స్వరూపం. హైదరాబాదు: రవికిరణ్ పబ్లికేషన్స్.

3. రామచంద్ర, తిరుమల. 1992. తెలుగు పత్రికలు - సాహిత్య సేవ. హైదరాబాదు: విశాలాంధ్ర బుక్‌హౌస్.

4. చంద్రశేఖర్, ఉద్దండం. 2012. ఆంధ్రజ్యోతి సాహిత్యసేవ - ఒక పరిశీలన. పి.ఎల్. శ్రీనివాసరెడ్డిగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్. డి. సిద్ధాంత గ్రంథం. అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం.

5. చిరంజీవి, జోగు. 2013. తెలుగు దినపత్రికలలో సాహిత్యపుటలు: చర్చనీయాంశాలు. డా. పమ్మి పవన్ కుమార్‌గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన ఎం.ఫిల్. పరిశోధన వ్యాసం. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం.

6. పవన్ కుమార్, పమ్మి. 1999. తెలుగు దినపత్రికలలో వార్తా రచన - విశేషాభివ్యక్తి. ఎన్.ఎస్. రాజుగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన ఎం.ఫిల్. పరిశోధన వ్యాసం. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం.

7. రాంప్రసాద్, కె. 1999. తెలుగు దినపత్రికల్లో సాహిత్యం (1970 - 1990). ఆర్. శ్రీహరిగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన పిహెచ్. డి. సిద్ధాంత గ్రంథం. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం.